## కథ

# ఎదురుచూసి మోసపోకుమా

**"పస్తులుండైనా పిల్లల్ని బడికి పంపాలి"**

**"చదువుకుంటే పైకి వస్తావ్"**

**"చదువ భవిష్యత్తుకు బంగారు బాట"**

**పాఠాల పండుగ సందర్భంగా నినాదాలు చేస్తూ బ్యానర్లు పట్టుకొని చిట్టిపొట్టి పిల్లలు ఊరేగింపుగా వెళ్తున్నారు. వాళ్ళతోబాటు టీచర్లు. ఊరేగింపు మెయిన్‌రోడ్ నుంచి మురికివాడ వైపు మళ్ళింది. ఒక గుడిశ ముందాగి-**

''మీ యింట్లో పిల్లలున్నారా?'' అడిగింది టీచర్.

''లేరు'' ఠక్కున సమాధానం. ఇల్లాలు అబద్ధం చెప్పిందని టీచర్ అనుమానం.

విద్య గొప్పదనం గురించి ఉపన్యాసం మొదలుపెట్టింది టీచర్.

''ఎల్లెల్లవమ్మా! పనిసేటు మాటలు సెప్పకు'' అంటూలోనికెళ్ళిపోయిందా యిల్లాలు.

ఇంకో యింటి వద్ద- ''మీ పిల్లాడిని బడికెందుకు పంపడంలేదు?'' అడిగింది టీచర్.

''మా గొర్రెల్ని నువ్వు కాత్తావా?'' అడిగాడా పెద్ద మనిషి!

పిల్లలంతా బయట నిలబడి నినాదాలిస్తోంటే- ఇంకో గుడిశ వద్ద-

''పస్తులుండైనా పిల్లల్ని బడికి పంపాలి. చదువుకుంటే అబ్బాయి పైకి వస్తాడు. అతనికింద కొందరు పనిచేస్తారు. చదువు- భవిష్యత్తుకి బంగారు బాట'' పడికట్టు మాటలు అంది టీచర్.

ఇంటి యిల్లాలు సూర్యంని పిలిచి ''ఇదిగో ఈడు మా సుట్టాలబ్బాయి. కాలోజీలో సదివాడు. ఈడికేదీ బంగారు బాట? ఏదీ ఉద్యోగం? అతని కింద పనివాల్లేరీ?'' నిలదీసిందామె.

ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ప్రశ్నకు జవాబు చెప్పలేని టీచర్ అవాక్కయింది. ప్రభుత్వ తాఖీదు ప్రకారం రోడ్డున పడి అలగా జనం చుట్టూ తిరగవలసి వచ్చినందుకుకామెకు బాధగానే ఉంది. ఆ నినాదాల మీద ఆమెకే నమ్మకం లేదు. ఇంక జవాబేం చెబుతుంది?

''ఎల్లెల్లవమ్మా, సెప్పొచ్చావ్! బడిలో కూకుని పాటాలు సెప్పుకో. అంతేగాని బడి ఎగ్గొట్టి పిల్లల్ని ఎండలో తిప్పమాకు'' ఇల్లాలే టీచర్‌కి పాఠం చెప్పేసింది.

ఇంకోపాక వద్ద-పిల్లల్ని ఎందుకు బడికి పంపడం లేదని అడిగితే-

''ఆ! ఎందుకా? నువ్వు పాటాలు మానేసి పిల్లల్నిలా ఎండలో ఊరేగిత్తావని!'' వెటకారంగా అందా యిల్లాలు.

అంతా చూస్తున్న సూర్యం ఆలోచిస్తున్నాడు. పనిచేసే ప్రభుత్వం కదా, ఏదో ఒక హడావుడి ఉండాలి- సమస్యల్నుంచి ప్రజల దృష్టి మళ్ళించడానికి! ఒక సమస్యపోతే మరొకటి. ఒక హడావుడి తగ్గితే ఇంకోటి. ప్రజల కోరగేది ఏమీ లేకపోయినా బాకా పత్రికలు బాగా బిల్డప్ ఇస్తాయి. లోగుట్టు అందరికీ ఎరుకే.

ఆనాటి హడావుడి అయాక టీచర్లంతా స్కూలుకెళ్ళి అనుభవాలు చెప్పుకున్నారు. వాళ్ళెవరికీ రోడ్డున పడి అలగాజనం నోటిలో నోరు పెట్టడం యిష్టం లేదు. అయినా తప్పని తద్దినం.

పాఠాల పండుగ అనే కాదు- ఓటర్ల లిస్ట్, రేషన్‌కార్డులు, జనాభా లెక్కలు, కుక్కలు పందులు, కాకుల లెక్కలూ, ఎలక్షన్‌లు, అన్నింటికీ టీచర్లే. ఇంత చేసినా పరీక్ష ఫలితాలు బాగులేకపోతే శిక్ష టీచర్లకే. ప్రభుత్వ విధానాలపై టీచర్స్‌రూంలో వేడివేడిగా చర్చ జరుగుతోంది. బ్రతకలేక బడిపంతులు- పాత సామెత. బ్రతకాలంటే బడిపంతులు అవకు- నేటి సామెత!

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు తెలిసిన సుందరికి మాత్రం ఏ సమస్యా లేదు. ఊరేగింపులు ఆమెకు పిక్నిక్‌తో సమానం. టీచర్ ఉద్యోగం అంత ఈజీ మరేదీ లేదని ఆమె ఉద్దేశం. స్కూలుకి టైమ్‌కి రాదు. టైమ్ కాకుండానే వెళ్ళిపోతుంది. పాఠాలు చెప్పదు. పరీక్షల్లో ఆమె వాచర్‌గా వస్తే పిల్లలకు పండుగే. ఇంచక్కా కాపీ చేసుకోవచ్చు! వచ్చే ఏడు ఆమెకు ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు వచ్చినా రావచ్చు. ఈ అన్నింటికీ ఒకే ఒక్క కారణం- ఆమె స్థానిక ఎమ్మెల్యే బంధువు కావడం!

పాఠాల పండుగ పేరు చెప్పి ఆ టీచర్‌లు కనీసం ఐదుగురు పిల్లల్ని బడిలో చేర్పించాలి. ఒక్కడూ దొరకలేదు-ఎన్ని ఊరేగింపులు జరిపినా.

''ఎందుకే వర్రీ? తలొక వందా యిలా యివ్వండి. ఐదుగుర్ని పట్టుకొచ్చి బడిలో చేర్పిస్తాను. వాళ్ళు నాలుగు రోజులొచ్చి కూలి తీసుకొని తర్వాత బడి మానేసి పోతారు'' తన అనంతకోటి ఉపాయాల్లో ఒకటి ప్రదర్శించింది సుందరి!

★ ★ ★

బాకా పత్రికలు కోడై కూశాయి-రాష్ట్రం అంతటా పాఠాల పండుగ సూపర్‌హిట్ అని. ప్రజలు సమధికోత్సాహంతో తమ పిల్లల్ని బడికి పంపుతున్నారట. ''అయ్యో, విద్యా ప్రయోజనాలు మాకెవరూ యింతవరకూ చెప్పనేలేదు. చెబితే అప్పుడే పిల్లల్ని బడికి పంపేవాళ్ళం, అయ్యో, అయ్యో'' అని ప్రజలు గుండెలు బాదుకున్నారట!

మరో రెండు రోజులకు- బడి మానేసిన పిల్లలు, బాల కార్మికులు, తల్లిదండ్రులు, సామాన్య ప్రజలతో మంత్రిగారు పట్నంలో మీటింగ్ ఏర్పాటు చేశారు.

''పస్తులుండి అయినా పిల్లల్ని బడికి పంపాలి'' మంత్రిగారి ఉద్ఘాటన.

''వాళ్ళని పనిలోకి పంపినా ఒక పూట పస్తులే'' ప్రజల గొణుగుడు.

''పిల్లల్ని పావులు చేయొద్దు. వాళ్ళకి చదువు చెప్పించి భవిష్యత్తుకు బంగారుబాట వేయండి. చదువుకుంటే పైకి వస్తారు. మీకిందే కొందరు పని చేస్తారు..'' ఊక దంపుడు మొదలుపెట్టారు మంత్రిగారు.

సూర్యం విషణ్ణంగా నవ్వుకున్నాడు. వేలిముద్ర మహానుభావులు మంత్రులై కోట్లు కూడబెడుతోంటే పి.హెచ్.డీలు బికారులై రోడ్డున పడడం మన ఒక్కదేశంలోనే సంభవం అనుకున్నాడు తిరస్కారంగా.

మంత్రిగారొక అమ్మాయిని వేదిక మీదకు పిలిచారు.

ఆ అమ్మాయి పొలంలో పని చేస్తోందట. రోజు కూలీ పాతిక రూపాయిలు, ఒక కల్లుసీసా అట! మంత్రిగారు దిగ్భ్రాంతి చెందారు.

మరొక పిల్లాడు ఇటుక బట్టీలో పనిచేస్తాడు. రోజుకూలీ ముప్పై.


మరొకడు హోటల్‌లో. ఇంకొకడు షాపులో.

భారత భాగ్యవిధాతల తలరాత పాతిక, ముప్పై రూపాయిలకే కాలి బుగ్గయిపోతున్నందుకు మంత్రిగారికి కన్నీళ్ళు తిరిగాయి. పిల్లల ముంగిట బంగారు బాట బదులు మురికి గుంటలు తవ్వుతున్న తల్లిదండ్రుల మీద కోపమూ వచ్చిందాయనకు.

''పెద్దలు పిల్లల శ్రమ దోచుకు తినడం ఘోరం. మీకోసం మూడువేల కోట్లతో అనేక పథకాలు చేపట్టాం. అది చాలదంటే ఇంకా చేస్తాం. తల్లిదండ్రులు పిల్లలకు పెట్టాలిగాని వాళ్ళ శ్రమ దోచుకు తినరాదు'' మంత్రిగారు ఘోషించారు.

''ఆ కోట్లు ఎవరి జేబుల్లోకి పోయాయో గాని మాకొక్క రూపాయీ చేరలేదు'' గొణిగాడొక మురికి నెధవ. వాడింకో మాట అనేలోగా కార్యకర్తలు వాడినోరు మూసి బయటకు లాక్కుపోయారు.

''పిల్లలూ! బడికి వెళ్లడం



మీ హక్కు. అమ్మా నాన్నా మిమ్మల్ని బడికి పంపకపోతే తిరుగుబాటు చేయండి. మిమ్మల్ని పనిలో పెట్టుకుని వేధిస్తున్నవారి పేర్లు మాస్టార్లకుగాని పోలీసులకుగాని చెప్పండి. వాళ్లని జైల్లో పడేసి మీకు పాతికవేలు ఇస్తాం. దానితో మీరు హాయిగా చదువుకోవచ్చు. అంతేకాదు భోజనం మేం పెడతాం. పుస్తకాలు మేం ఇస్తాం. బట్టలూ ఇస్తాం. మీకు ఫీజు లేదు. హాయిగా చదువుకోవడమే'' రంగుల కల చూపించారు మంత్రిగారు.

''మంత్రిగారి తపనకు ప్రజలు పులకించిపోయారు. అప్పటికప్పుడు పదిమంది బాలకార్మికులు బడిలో చేరడానికి ముందుకొచ్చారు. పిల్లలతో పని చేయించుకుంటున్న ఒక షాపు యజమానికి ఒక భూస్వామికి తలా పాతికవేలు జుల్మానా విధించి ఆ డబ్బు వసూలుచేసి పిల్లలకిమ్మని మంత్రిగారు కలెక్టర్‌ని ఆదేశించారు'' అంటూ పత్రికలు ఆ మీటింగ్‌కి బ్రహ్మాండమైన కవరేజీ ఇచ్చాయి.

విద్యావ్యాప్తికి విదేశాల నుంచి వచ్చిన గ్రాంట్‌లను తగినవిధంగా ఖర్చు చేయడానికే ఈ హడావుడి అనిపించింది సూర్యంకి.

పదిరోజుల పాఠాల పండుగ పేరుచెప్పి లక్షరూపాయలు ఖర్చయితే మురికివాడ మొత్తానికి ఒకే ఒక కుటుంబం తమ అబ్బాయి కృష్ణని బడికి పంపడానికి ఒప్పుకుంది. కృష్ణను కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లాడు సూర్యం.

సూర్యంని పక్కకు నెట్టేసి- కృష్ణకు బట్టలు ఇస్తున్నట్టు ఒక విశ్వదాత, పుస్తకాలిస్తున్నట్టు ఒక ధర్మదాత, పెన్ ఇస్తున్నట్టు ఒక స్థానిక దాత గ్రూపు ఫోటోలు విడియోలు తీయించుకున్నారు.

పట్నంకి పాతిక కిలోమీటర్ల దూరంలో గొందిపాలెం ఆశ్రమ పాఠశాలలో కృష్ణకు సీటు ఇస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశాడు. ఆ కాగితం పట్టుకొని గొందిపాలెం వెళ్లి ఆ స్కూలు, పరిసరాలూ చూస్తూనే సూర్యం, కృష్ణల నవనాడులూ కుంగిపోయాయి.

★ ★ ★

వారం రోజులు గడిచాక కృష్ణని చూడవచ్చిన సూర్యం షాక్ అయ్యాడు.

బాగా చిక్కిపోయి బెంగ పడుతున్నాడు కృష్ణ. ''నేనిక్కడ చదవను. ఇక్కడేం బాగులేదు. ఇంటికొచ్చేస్తాను'' అని ఏడ్చేశాడు.

**ప్రఫుల్లచంద్ర**

తన క్లాసులో కృష్ణ అందరికన్నా పెద్ద. అందరి కన్నా మొద్దు! తను చదువు మానేసి చాలాకాలం కావడంతో ఇప్పుడు బడిలో అంతా అయోమయం. పాఠాలు అర్థం కావు. రాత కుదరదు. అందరూ ఎద్దేవా చేయడమే. మాస్టార్లు కూడా ''ప్రభుత్వం వారి ముద్దుబిడ్డా'' అని పిలుస్తున్నారు! సందేహాలు తీర్చడం లేదు సరికదా ఇంటి పనులు చేయించుకుంటున్నారు.

అన్నిటికన్నా విషాదం- భోజనం!

వంట, వడ్డనా చేయవలసిన తాటకి సగం సరుకులు ఇంటికి తరలించి రెండురోజులకొకసారి పిల్లల సాయంతో వంట చేస్తుంది. పిల్లలే వడ్డన. ప్రభుత్వం లెక్క ప్రకారం అన్నం, కూర, సాంబారు, రోజుకొక గుడ్డు. కానీ అక్కడ ఇచ్చేది వారానికొక గుడ్డు. కూర అసలే లేదు. అన్నంలో పురుగులు, సాంబారులో కంపు- అదనం! పైగా ప్రభుత్వ సొమ్ము తేరగా మింగండి, బుక్కండి అని రోజూ వేళాకోళాలూ, తిట్లూ.

''నిన్న భోజనం చేయగానే పదిమందికి వాంతులూ, విరేచనాలూ పట్టుకుంటే వాళ్లని ఆసుపత్రికి తరలించి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. ''మన ఊళ్లో నేనే సంపాదించుకొని తినేవాడిని. ఇక్కడ ఈ ముష్టికూడు, పరాయి కూడు తినలేను. అవమానాలు భరించలేను. ఇక్కడే ఉంటూ పురుగుల అన్నం తింటూ కుక్కచావు చావడం నాకిష్టంలేదు'' రోదించాడు కృష్ణ.

ఆ రాత్రే కృష్ణని ఇంటికి తీసుకొచ్చేశాడు సూర్యం.

గొందిపాలెం ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి పదివరకు క్లాసులున్నాయి. నవయువ్వనం పొటమరించి, నూనూగుమీసాలు తేలుతున్న పాతికమంది విద్యార్థులున్నారు. వాళ్లకి హాస్టల్ యవ్వారం, స్కూలు పద్ధతి చూస్తోంటే ఆవేశం తన్నుకొస్తోంది. కలెక్టర్ వద్దకెళ్లి కష్టాలు చెప్పుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆ ఉదయం వాళ్లు పట్నం వెళ్లి కలెక్టర్ ఆఫీస్ గేటు వద్ద గుంపుగా నిరీక్షిస్తున్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కంకణం కట్టుకున్న కలెక్టర్‌గారి ఆఫీసు ప్రక్కనే వున్న కాంటీన్‌లో కృష్ణ పనిచేసేవాడు. ఇప్పుడు బడి మానేసి మళ్లీ పనికోసం కాంటీన్‌కి వెళ్తూ తన మాజీ బడిపిల్లలు కనిపిస్తే అక్కడికి వెళ్లాడు కృష్ణ.

కారులో వస్తున్న కలెక్టర్- గేట్ వద్ద నినాదాలు చేస్తున్న పిల్లల్ని చూసి కారు దిగి- ఒక్కసారిగా రెచ్చిపోయాడు. ''రాస్కెల్స్! ప్రభుత్వం మీకోసం కోట్లు గుమ్మరిస్తోంటే తేరగా తిని కొవ్వెక్కి రోడ్డున పడతారా?! బుద్ధిగా చదువుకోండి- తిండి పెడతాం, పుస్తకాలిస్తాం, బట్టలిస్తాం అని చెబితే చదువు ఎగ్గొట్టి నినాదాలు చేస్తారా?!'' వీరంగం ఆడుతూ సెక్యూరిటీ సిబ్బంది నుంచి లాఠీ లాక్కుని పిల్లల్ని చావబాదాడు. కాళ్లకడ్డం పడినవాళ్లని బూటుకాళ్లతో తన్నాడు. తర్వాత అలసిపోయి రొప్పుతూ, రోజుతూ, బుసకొడుతూ కారులో కూలబడి ఆఫీసుకెళ్లిపోయాడు.

అటు వెళ్తున్న పత్రికా సిబ్బంది కంటపడిందా దృశ్యం. గబగబా ఫోటోలు తీసింది.

బాకా పత్రికలు కూడా ఒక్కోసారి సన్నాయినొక్కులు నొక్కుతాయి. మర్నాడు పత్రికల్లో మొదటిపేజీలోనే 'కలెక్టర్ వీరంగం' శీర్షికతో, ఫోటోలతో వివరాలు వచ్చాయి. దాంతో కొన్ని సంఘాలు రుసరుస! మరికొన్ని బుసబుస!

''చదువు మానుకొని కష్టపడి ఇంతదూరం రావాలా? అర్ధరూపాయి కార్డుముక్క రాసి పోస్ట్‌లో పడేస్తే నేనే వాళ్లవద్దకెళ్లి సమస్యలు సర్దుబాటు చేసేవాడిని కదా అని ఒక అన్నలాగే తమ్ముళ్లకు హితవు చెప్పాను. అంతే. వాళ్లని కొట్టలేదు'' అని కలెక్టర్ గారి సమాధానం.

పత్రికలు ప్రచురించిన ఫోటోలు అబద్ధం. రాసిన రాతలు కల్పితం. దెబ్బలు తిన్న విద్యార్థులు మిథ్య. చూసిన ప్రజలు వెర్రివెంగళాయిలు!


కలెక్టర్‌గారి నివేదికే ఖాయం- ప్రభుత్వానికి!

కలెక్టర్‌గారి దెబ్బలు రుచి చూసిన కృష్ణ ఇంటికొచ్చి పడిపోయాడు. జ్వరం.. కలవరింతలు.. ఉలిక్కిపడి లేవడం.. మళ్లీ మగతలోకి జారుకోవడం.

పిల్లాడి పరిస్థితికి తల్లడిల్లిపోయిన కన్నతల్లి ''పాఠాల పండుగంటూ మళ్లీ వాళ్లని రానియ్! తెడ్డు తిరగేస్తా! అట్లపుల్ల కాల్చి వాతలు పెడతా'' కసిగా అనుకుంది.

నాలుగైదు రోజుల్లో తేరుకున్న కృష్ణ ''అమ్మా! చదువుకుంటానే'' నీరసంగా అన్నాడు.

చటుక్కున వాడిని గుండెలకు హత్తుకొని




''వద్దురా కన్నయ్యా! ఆ సదువులు మనకొద్దు. బడికెళ్లి సచ్చేకంటే ఆ సావేదో ఇక్కడే సద్దాం'' అందామె.

''బడికెల్లనే. కాని సదూకుంటా'' మగతగా కళ్లు మూసుకున్నాడు కృష్ణ.

వాడికెలా ఉందో చూసి పోదామని వచ్చిన సూర్యం- కృష్ణ మాటలు విని తడిక గోడని ఆనుకొని ఆలోచిస్తూ వుండిపోయాడు.

పిల్లల్ని పనుల్లోకి పంపకండి- బడికి పంపండి అనడం బాగానే వుంది. కాని రెక్కాడితేగాని డొక్కాడని కూలీలకు అది సాధ్యమా?

తిండి లేక డొక్క మాడిన వ్యాసుడు అంతటివాడే కాశీ అన్నపూర్ణను శపించబోయాడు. డొక్కలు మాడే నిరుపేదల హృదయాలకు సుద్దులు ఎక్కుతాయా? ప్రభుత్వ పథకాలు పేదలకు తిండి పెట్టగలుగుతున్నాయా?

సూర్యం ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ, తిట్టుకుంటూ ఆలోచిస్తూండగా- ఎక్కడనుంచో పాట... ''ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఎదురుచూసి మోసపోకుమా..''

ప్రజల ప్రతి అవసరమూ ప్రభుత్వమే తీర్చాలంటే కుదురుతుందా?

ఏ ప్రభుత్వానికైనా అది సాధ్యమా?

తమని తాము ఉద్ధరించుకునే ప్రయత్నం ప్రజలు కూడా చేయాలి కదా!

కృష్ణకి, అలాంటి అనేకమందికి తను ఏమయినా చేయగలడా?

మళ్లీ ఆలోచనలు... ఆలోచనలు...

డిగ్రీ పాసైన సూర్యం, రెండేళ్లుగా నిరుద్యోగి. ఇంక ప్రభుత్వ ఉద్యోగం దొరకదని- గత నాలుగైదు నెలలుగా ప్రయివేటు స్కూలులో మాస్టారుగా వెయ్యిరూపాయల జీతానికి తలకాయ ముక్కలు చేసుకుంటున్నాడు.

తనకి సాయంకాలం, రాత్రి ఖాళీయే. పనిలోకి వెళ్లే పిల్లలకూ ఖాళీయే. ఆ సమయంలో వాళ్లకి తనే చదువు చెబితే...

తనకు శ్రమ మిగులుతుంది. పైసా రాబడి వుండదు.

అయితేనేం తనవాళ్లకి కాస్తంత ఉపయోగపడినందుకు సంతృప్తి లభిస్తుంది.

'పని మానెయ్. బడి మానకు' అనేది ప్రభుత్వ ప్రచారం అయితే...

'పని మానకు. బడీ మానకు' అనేది తన ప్రచారం అవ్వాలి. అప్పుడు-

''ప్రభుత్వం ఓడినచోట నేను గెలుస్తాను'' సంతృప్తిగా అనుకున్నాడు సూర్యం.

✤